కుటుంబ వివరాలు గోప్యంగా ఉంచాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, నవంబర్ 6: కుటుంబ సభ్యుల వివరాలు గోప్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అధికారులకు సూచించారు. బుధవారం ఝరాసంగం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే చేసిన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చూసుకోవాలన్నారు. అనంతరం దవాఖానను సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మండల పరిధిలోని సంగం(కె) బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పట్లోల్ల జనార్దన్ రెడ్డిని నియమించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకార్, మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్ రావు పటేల్, సంగమేశ్వర్ పటేల్, నర్సింహా గౌడ్, ఏజాజ్ బాబా, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

నారాయణఖేడ్: సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, నవంబర్ 6: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మార్వాడీగల్లి, మండల పరిధిలోని అంత్వార్ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి కుల గణన సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వే ఫలితాలు భవిష్యత్తులో ప్రజలకు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఇంటికి సర్వే స్టిక్కర్‌ని అతికిస్తున్న సిబ్బంది

కొండాపూర్: మధ్యాహ్నం సెలవు కావడంతో పాఠశాలలోనే ఆటలు ఆడుతున్న విద్యార్థులు

గుమ్మడిదల: ఎన్యూమరేటర్లకు హౌస్‌లిస్ట్ అందజేస్తున్న ఈవో ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ తదితరులు

బియ్యం లారీని పట్టుకున్న అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి, నవంబర్ 6: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకొని నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజేశ్‌నాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కంకోల్ డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలో హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకొని సదాశివపేట సివిల్ సప్లయ్ గోదాంకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కల్టెర్ డీటీగా బాల్‌రాజ్

కల్టెర్, నవంబర్ 6: కల్టెర్ డిప్యూటీ తహసీల్దార్‌గా బాల్‌రాజ్‌ను నియమిస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌గా బాల్‌రాజ్ అమీర్‌పూర్‌లో విధులు నిర్వహించారు. కల్టెర్‌కు బదిలీ చేయడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

వట్‌పల్లి, నవంబర్ 6: వట్‌పల్లి మండల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధం చేసినట్లు కార్యదర్శి సునీల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని మర్కెట్ కమిటీ ఆవరణంలో గురువారం నిర్వహించే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం/గుమ్మడిదల, నవంబర్ 6: జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని జిన్నారం, సోలక్‌పల్లి, శివనగర్, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు గమనించి సహకరించాలన్నారు. బొంతపల్లి ఏఈ రవీందర్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం, నవంబర్ 6: ఆర్సీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటనెన్స్, చెట్ల కొమ్మల తొలిగింపు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆర్సీపురం, అశోక్‌నగర్ ఏఈలు తిరుపతమ్మ, రాజేశ్‌లు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆర్సీపురం సబ్‌స్టేషన్‌లోని ఎల్ఐజీ, హెచ్ఐజీ ఫీడర్‌లో ఉదయం 10.30గంటల నుంచి 2.30గంటల వరకు, ఆర్ఆర్‌నగర్ ఫీడర్‌లో 2.30నుంచి 4.30గంటల వరకు, అశోక్‌నగర్ ఫీడర్‌లో 10.30నుంచి 1.30గంటల వరకు, అమీన్‌పూర్ ఫీడర్‌లో 1.30నుంచి 4.30గంటల వరకు విద్యుత్ ఉండదని వివరించారు.

సమయపాలన తప్పక పాటించాలి

కోహీర్, నవంబర్ 6: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలంటే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కవేలి ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల సమయం ముగిసే వరకు విద్యార్థులను బయటకు పంపొద్దని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎంలు, ఉపాధ్యాయులున్నారు.

గంజాయి తరలిస్తే చర్యలు

మునిపల్లి, నవంబర్ 6: అక్రమంగా గంజాయి, నార్కోటిక్స్, డ్రగ్ తరలిస్తే ఎంతటివారైనా కేసులు నమోదు చేస్తామని మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కంకోల్ శివారులోని డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముంబయి జాతీయ రహదారిపై జాగిలంతో వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయం, పంట గురించి వివరాలు తెలిస్తే పోలీసులకు తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై రాజేశ్ నాయక్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 6: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా వేతనాలను క్రమం తప్పకుండా చెల్లించాలన్నారు. గ్రామ సేవకులుగా ఎంత పని చేసినా ఇప్పటికీ కనీస వేతనం లేదన్నారు. కార్మిక పోరాటాల ఫలితంగా నెలకు రూ.9,500 ఇస్తున్నా, అవి కూడా రెగ్యులర్‌గా రావడం లేదని మండిపడ్డారు. ఎన్నికల వేల ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీపీవో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, బాబురావు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సత్తయ్య, శంకర్, మహేశ్, వీరేశం పాల్గొన్నారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

టీటీడీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రభాకర్, నాయకులు

సంగారెడ్డి, నవంబర్ 6: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన అనుచరులతో కలిసి బుధవారం దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వారిని ఆలయ అర్చకులు ఆలయ నిబంధనల మేరకు స్వాగతం పలికి ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం భక్తులు, ముఖ్య నాయకులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం టీటీడీ నూతన చైర్మన్ బీఆర్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల దర్శనానికి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, కొండల్ రెడ్డి, మామిళ్ల రాజేందర్, ఆర్.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్. చిట్కుల మల్లేశంముద్ద నాగు ఉన్నారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

హత్నూర, నవంబర్ 6: టీపీటీఎఫ్ హత్నూర మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బానోత్‌రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సంగారెడ్డి, ఉపాధ్యక్షులుగా నర్సింగ్, లోకనాథం జ్యోతి, కార్యదర్శులుగా గంగరాజు, ధర్మారావు, వెంకటేశం, ప్రసన్న, జిల్లా కౌన్సిలర్లు గనేశ్, రజని, గౌసోద్దీన్, మల్లప్ప, నరేశ్, సభ్యులుగా వెణుగోపాల్, ప్రవీణ్, అకడమిక్ సెల్ కన్వీనర్ వాసవి, జీవోల కమిటీ కన్వీనర్ సత్యనారాయణ, సభ్యులు శ్వేత, ప్రేమలత, సోషల్ కమిటీ కన్వీనర్ మంజుల, సభ్యులు సంధ్యారాణి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, విజయభాస్కర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బానోత్ రవీందర్, అధ్యక్షుడు

ప్రభుత్వానికి ఆలయాల రక్షణ పట్టదా?

సిర్గాపూర్, నవంబర్ 6: హిందూ ఆలయాల్లో విధ్వంసానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని నారాయణఖేడ్ నియోజవర్గం బీజేపీ సీనియర్ నాయకుడు అరుణ్‌రాజ్‌శేరికార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని చీమల్ గ్రామాన్ని సందర్శించిన ఆయన శివాజీ విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. హిందువుల సంరక్షణ, ఆలయాల స్థిర ఆస్తుల రక్షణకు హిందూ సనాతన ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహాల రక్షణకు చర్యలు తీసుకుంటూ, విధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు జ్ఞానేశ్వర్, సుభాష్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నందీశ్వరుడికి కార్తిక దీపాలు

కోహీర్, నవంబర్ 6: కార్తిక మాసోత్సవాల సందర్భంగా మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో బుధవారం కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయ ఆవరణలోని నందీశ్వరుడి విగ్రహం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శివలింగానికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. జగదీశ్వర్‌స్వామి, భుజంగం, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తిక దీపాలను వెలిగించిన అర్చకులు,



నారాయణఖేడ్: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న అర్చకులు

'లలితావైభవం'లో మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, నవంబర్ 6: నారాయణఖేడ్ పట్టణంలోని దుర్గాభవానీ ఆలయంలో అర్చకుడు మలమంచి మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన లలితావైభవం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కారగ్రహీత గరికపాటి నరసింహారావు హాజరై లలితావైభంపై ప్రవచనం చేశారు. శ్రీగురు మదనానంద రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతిస్వామి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ పాల్గొని ప్రవచించారు.

శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

సిర్గాపూర్, నవంబర్ 6: ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం చీమల్ గ్రామంలో శివాజీ మహారాజ్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయనకు గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు బస్వరాజ్, బసిరెడ్డి, జ్ఞానుపాటిల్, హన్మారెడ్డి, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

హత్నూర, నవంబర్ 6: వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన హత్నూర కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదువులో రాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి విద్యా బోధన అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జయలక్ష్మి పాల్గొన్నారు.

హత్నూర కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

బస్తీ దవాఖాన నిర్మాణానికి భూమిపూజ

హత్నూర, నవంబర్ 6: మండల పరిధిలోని కాసాలలో బస్తీ దవాఖాన భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ మాట్లాడుతూ దవాఖాన భవన నిర్మాణ పనులు పూర్తయి దవాఖాన అందుబాటులోకి వస్తే గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు రాంరెడ్డి, వెంకటేశంగుప్త, సురేందర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రమేశ్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కాసాలలో భూమిపూజ చేస్తున్న నాయకులు

దళారులను నమ్మి మోసపోవద్దు

వట్‌పల్లి, నవంబర్ 6: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని ఖాదిరాబాద్‌లో పీసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వడ్లను సెంటర్ వద్దకు తీసుకువచ్చే సమయంలో తేమ శాతం చూసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బందులు వాటిల్లాకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈవో పరిమిళ, సీఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖాదిరాబాద్‌లో కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వినోద్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ

హత్నూర, నవంబర్ 6: హత్నూరలో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. ఆకుల మల్లికార్జున్, చరణ్ కన్నెస్వాముల ఆధ్వర్యంలో శివాలయంలో ఏర్పాటుచేసిన మహా పడిపూజలో మండలంలోని అయ్యప్పస్వాములు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. కన్నయ్య, ఆంజనేయులు గురుస్వాముల ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పల్లకీ సేవ నిర్వహించి అన్నదానం చేశారు.

మండల దీక్షలు ప్రారంభం

బొల్లారం, నవంబర్ 6: బొల్లారం భవానీ శంకర ఆలయంలో భక్తులు అయ్యప్ప మాల ధారణ చేశారు. దీక్ష తీసుకున్న వారిలో మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ వేణుపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు లక్ష్మీనాయుడు, యాదగిరి గౌడ్, విజయ్‌రెడ్డి ఉన్నారు.

హత్నూర: మహా పడిపూజలో స్వాములు

ఊట్ల అయ్యప్ప ఆలయంలో..

జిన్నారం, నవంబర్ 6: ఊట్ల అయ్యప్ప ఆలయంలో మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. సుమారు యాభై మంది సోమవారం, బుధవారాల్లో అయ్యప్ప మాలలు ధరించి దీక్షలు చేపట్టారు. 41 రోజుల పాటు అయ్యప్ప నామస్మరణ మారుమోగనున్నది.

పటాన్‌చెరు: చెరుకును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఛట్ పూజలకు చెరుకు పంపిణీ

పటాన్‌చెరు, నవంబర్ 6: ఉత్తర భారతీయులు జరుపుకొనే ఛట్ పండుగకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఏడు లారీల చెరుకును ఉచితంగా అందజేశారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన చెరుకు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అమీన్‌పూర్, ఇస్నాపూర్, బొల్లారం, పాశమైలారం, రామచంద్రాపురం పట్టణాల్లోని ఉత్తర భారతీయులకు చెరుకును అందజేస్తున్నామన్నారు. ఛట్ పండుగను ఘనంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

బొల్లారంలో..

బొల్లారం, నవంబర్ 6: బొల్లారం పారిశ్రామిక వాడలోని ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఛట్ పూజలకు స్థానిక నాయకులు బాల్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి చెరుకు గడలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలో నివసించే వలస రాష్ట్రాల ప్రజల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తామన్నారు. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఛట్ పూజలను జరుపుకునేందుకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. పూజలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఛట్ పూజల నిర్వహణ కోసం ఇప్పటికే పోచమ్మ బస్తీలోని దుర్గామాత ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికిరణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు లక్ష్మీనాయుడు, నాయకులు విజయ్‌రెడ్డి, నితిన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేశ్, నరేందర్, దీననాథ్, దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులు, ఆయా రాష్ట్రాల మహిళలు పాల్గొన్నారు.

ఛట్‌పూజకు ఏర్పాట్లు

రామచంద్రాపురం, నవంబర్ 6: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం జరుగనున్న ఛట్ పూజకు సంబంధించిన ఏర్పాట్లను కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ పరిశీలించారు. ఆర్సీపురం పరిధిలో నివాసం ఉంటున్న బీహారీలు ప్రతి ఏడాది ఛట్ పూజను నిర్వహిస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా బల్దియా నుంచి ఏర్పాట్లు చేయించారు. కార్యక్రమంలో సాయిలు, సత్యనారాయణ, కిరణ్‌గౌడ్, ఏఈ ప్రభు తదితరులు ఉన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు

హత్నూర, నవంబర్ 6: గ్రామాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ మాధురి ఆదేశించారు. బుధవారం హత్నూర మండలం దౌలాపూర్, దౌల్తాబాద్, మంగాపూర్, దేవులపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులకు ధాన్యం విక్రయించి మోసపోకుండా ఉండడం కోసం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేసి వివరాలను ట్యాబ్‌ల్లో నమోదు చేయాలన్నారు. వరికోత సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకొని ధాన్యం తీసుకురావాలన్నారు. తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఏపీఎం దేవేందర్ పాల్గొన్నారు.

మంగాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

ఎట్టకేలకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

పుల్కల్‌లో ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

పుల్కల్, నవంబర్ 6: మండల కేంద్రం పుల్కల్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మరుసటి రోజే మూసి వేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ నెల 2, 5 తేదీల్లో నమస్తే తెలంగాణ వార్తా పత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. మంగళవారం అదనపు కలెక్టర్ మాధురి కొనుగోలు కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన సందర్భంగా పుల్కల్‌లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. రైతులు ఎదుర్కొంటున్న బాధలు తెలుసుకున్నారు.15 రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని ఎందుకు తీసుకోవడం లేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బుధవారం సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

సిర్గాపూర్, నవంబర్ 6: పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి అన్నారు. బుధవారం సిర్గాపూర్ తహసీల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు స్థానికంగా రెవెన్యూ ధరణి రికార్డులు, పెండింగ్ సమస్యలపై ఆరా తీశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ ఉమాశంకర్‌తో సమావేశమై చర్చించారు. నిత్యం కొనసాగుతున్న భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పనితీరును పరిశీలించారు. రైతుల నుంచి రెవెన్యూ సమస్యల ఫిర్యాదులు రాకుండా క్షుణ్ణంగా పరిశీలించి, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది హన్మంతు తదితరులు ఉన్నారు.

సిర్గాపూర్ తహసీల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో అశోకచక్రవర్తి

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్: 5-1-664, 665 & 669, సురభి ఆర్కేడ్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్-500001

ఆవరణ కావలెను

తెల్లాపూర్, రామచంద్రాపురం మండలం, సంగారెడ్డి జిల్లా ప్రాంతంలో లీజు అద్దె ప్రాతిపదికన కమర్షియల్/ ఆఫీస్ ఆవరణ కొరకు యజమానులు/ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్స్ నుండి ఆఫర్లు కోరబడుచున్నవి. సుమారు కార్పెట్ ఏరియా 1200 **నుండి** 1800 **చ.అ.** గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వాటికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి గల పార్టీలు 21-11-2024 **సా.**5.00 **గం.**కు లేదా ఆలోగా **CRM, RO, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్**-1 వద్ద సీల్డ్ కవర్‌లో వారి ఆఫర్లను దాఖలు చేయవలెను.

తేది: 06-11-2024 | సం/- రీజినల్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ఏకాదశ దినకర్మ